దేశ భాషలందు తెలుగు లెస్స..

నేడు తెలుగుభాషా దినోత్సవం

కామారెడ్డి, ఆగస్టు 28 : దేశ భాషలందు తెలుగు లెస్స అని శ్రీకృష్ణదేవరాయలు చెప్పిన.. చెయ్యెతి జైకొట్టు తెలుగోడా.. గతమెంతో ఘనకీర్తి గలవోడా.. అనే వేములపల్లి గీతం ఆలపించిన తెలుగువారి రోమాలు నిక్కపొడుచుకుంటాయి. ప్రతియేటా ఆగస్టు 29న తెలుగు కవి గిడుగు వెంకట రామమూర్తి జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవాన్ని జరుపుకొంటాం. అమ్మ చేతిలోని గోరుముద్ద ఎంత మధురంగా ఉంటుందో తెలుగు భాష కూడా అంత మధురమైంది. ప్రపంచంలో తెలుగు భాషస్థాయి చాలా గొప్పది. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు తెలుగు భాషపై కాంపిటీషన్ నిర్వహించి తెలుగు భాషను ప్రోత్సహిస్తున్నారు. ప్రపంచీకరణతో పిల్లలను ఆంగ్ల మాధ్యమంలో చదివించడానికి ఎక్కువ మంది తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం కేవలం 27 శాతం మంది పిల్లలు మాత్రమే తెలుగు మాధ్యమంలో చదువుతున్నారని సమాచారం. టెలివిజన్ మాధ్యమాల్లో పరభాష పదాల వాడుక పెరిగిపోతున్నది. ఇలాగే కొనసాగితే తెలుగు వాడుక తగ్గిపోయి, మాతృభాషగా మారే ప్రమాదమున్నది. ఐక్యరాజ్యసమితి విద్య సాంస్కృతిక సంస్థ 1999/2002-12 తీర్మానంలో ప్రపంచంలోని ఆరు వేల భాషల్లో 3 వేలు కాలగర్భంలో కలిసిపోగా, 2025 నాటికి భారత దేశంలో కేవలం 5 భాషలు (హిందీ, బెంగాలీ, మరాఠీ, తమిళం, మలయాళం) మిగులుతాయని ప్రముఖులు పేర్కొంటున్నారు.

తెలుగు భాషను విస్మరిస్తున్నారు..

మన మాతృభాష తెలుగును తల్లి ఒడిలో నుంచి పెరిగి పెద్ద అయ్యేదాక తెలుగులోనే మాట్లాడుకుంటున్నాం. కాని విద్యాభ్యాసం చేస్తున్నప్పుడు మాతృభాషను విస్మరించి ఆంగ్లం వంటి ఇతర భాషలవైపు వెళ్తున్నారు. మన మాతృభాష ఎలా మాట్లాడుగలుగుతాం. తమిళం, మళయాళం మాతృభాషలుగా కలిగిన రాష్ట్రాల్లో అక్కడి ప్రజలు తమ మాతృభాషలోనే మాట్లాడడానికి ప్రయత్నిస్తారు. కాని తెలుగువారు మాత్రం తెలుగును వదిలేసి ఇంగ్లిష్ పదాలతోనే ఎక్కువగా మాట్లాడుతారు. ఇది శోచనీయం. కనుక మన మాతృభాషను మనమే ఆదరించాలి, సాధ్యమైనంత వరకు తెలుగులోనే మాట్లాడాలి. తెలుగు మాధ్యమంగానే చదువుకోవాలి.

సౌత్ క్యాంపస్‌లో మొక్కలు నాటిన సిబ్బంది

సౌత్ క్యాంపస్ లో ఔషధ మొక్కలు నాటిన ప్రిన్సిపాల్, దోమకొండ పోర్టు ట్రస్ట్ నిర్వాహకులు, అధ్యాపకులు

భిక్కనూరు, ఆగస్టు 28 : టీయూ దక్షిణ ప్రాంగణంలో సీజీఆర్ కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ వారు ఔషధ మొక్కలు నాటారు. కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ వారి సహకారంతో ఔషద మొక్కలను నాటారు. ఈ కార్యక్రమాన్ని సౌత్ క్యాంపస్ ప్రిన్సిపాల్ సుధాకర్ గౌడ్, దోమకొండ పోర్టు ట్రస్టు నిర్వాహుడు బాబ్జీతో కలిసి ప్రారంభించారు. క్యాంపస్ ఆవరణలో తులసి, అలవెరా, లెమన్ గ్రాస్, తమలపాకు, విద్యార్థుల జ్ఞాపకశక్తి కోసం సరస్వతి, బ్రహ్మీ, శంకు పుష్పం, ఉసిరి, నేల ఉసిరి, రణపాల, గోరింటాకు తదితర మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వరి, మోహన్ బాబు, హరిత, వీరభద్రం, యాలాద్రి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాకు సహకరించాలి

కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

దవాఖాన సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి, ఆగస్టు 28 : నూతన ఓటరు జాబితా తయారీకి రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం కలెక్టర్ సమావేశం నిర్వహించి నూతన ఓటరు జాబితా తయారు 2025పై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ సర్వే చేసి చనిపోయిన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగించడం, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారి పేర్లను జాబితాలో చేర్చడం,ఇతర చోటికి వెళ్లిన వారి పేర్లను తొలగించడం, 1 జనవరి 2025 వరకు 18 ఏండ్లు నిండినవారిని ఓటరుగా నమోదు చేసే ప్రక్రియ కొనసాగుతున్నదని తెలిపారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి ఆర్డీవోలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

హన్మాండ్లును అభినందించిన కలెక్టర్

కామారెడ్డి జిల్లా బాన్సువాడకు చెందిన పిచ్చుక హన్మాండ్లు (విశ్రాంత ఉపాధ్యాయుడు) తన సొంత ఇంటి ఆవరణలో ప్రస్తుతం 300 మొక్కలు పెంచి వాటిని సంరక్షిస్తున్నందుకు కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ ఆయనను బుధవారం అభినందించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన జిల్లా సహకార అధికారిణి

కామారెడ్డి జిల్లా సహకార అధికారిణిగా మమత నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆమె కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్‌ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకేను అందజేశారు. ఆమె హైదరాబాద్ మార్కెడ్ ఆఫీస్ నుంచి బదిలీపై వచ్చారు.

గర్గుల్ ఉన్నత పాఠశాల తనిఖీ

కామారెడ్డి రూరల్, ఆగస్టు 28 : కామారెడ్డి మండలం గర్గుల్ గ్రామంలో ఉన్నత పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, మెనూ ప్రకారం విద్యార్థుల కు భోజనం అందించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, జడ్పీ సీఈవో చందర్ నాయక్, డీఆర్డీవో సురేందర్, ఎంఈవో, పంచాయతీ సెక్రటరీ పాల్గొన్నారు. గర్గుల్ గ్రామంలోని పల్లె దవాఖాన, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో ఓపీ, రక్తపరీక్షల ల్యాబ్, ఫార్మసీకి సంబంధించిన వాటిని తనిఖీ చేశారు. దవాఖాన పరిసరాల పరిశుభ్రత, సిబ్బంది హాజరు వివరాలపై వాకబు చేశారు. జ్వర సర్వే నిర్వహించి వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వివరాలు నమోదు చేసుకోవాలి

రాజంపేట్, ఆగస్టు 28 : రైతు రుణమాఫీ కోసం మండలంలోని 429 మంది రైతులు కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారిణి సునీతారాణి తెలిపారు. ఆన్‌లైన్ లిస్టు బ్యాంకుల వారీగా వచ్చిందన్నారు. సంబంధిత ఏఈవోలను సంప్రదించి మండల వ్యవసాయాధికారి వద్ద ధ్రువీకరణ పత్రంపై సంతకం చేసి తమ కుటుంబ సభ్యుల వివరాలను నిర్ధారణ చేసుకోవాలని రైతులను కోరారు.

వాహనాల తనిఖీ

బీబీపేట్, ఆగస్టు 28: బీబీపేట, జనగామ రోడ్డులో హెడ్ కానిస్టేబుల్ సాయిబాబా, పోలీస్ సిబ్బంది కలిసి బుధవారం వాహనాలను తనిఖీ చేశారు. సరైన ధ్రువ పత్రాలులేని 50 మంది వాహనదారులకు జరిమానా విధించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది రవీందర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

రుణమాఫీ కోసం దరఖాస్తుల స్వీకరణ

బీబీపేట్, ఆగస్టు 28 : మండల కేంద్రంతోపాటు మాందాపూర్, మల్కాపూర్, యాడారం, తుజాల్‌పూర్ తదితర గ్రామాలకు చెందిన రుణమాఫీకాని రైతులు ఆయా గ్రామాల్లోని రైతు వేదికల వద్ద ఉన్న ఏఈవోలకు దరఖాస్తులు అందజేశారు. కార్యక్రమంలో ఏఈవోలు రాఘవేంద్ర, సంతోష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా చర్యలు చేపట్టాలి

మాట్లాడుతున్న ఎస్పీ సింధూశర్మ

పాల్గొన్న పోలీస్ సిబ్బంది

కామారెడ్డి, ఆగస్టు 28 : వినాయక చవితి, నవరాత్రి పండుగ సందర్భంగా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని ఎస్పీ సింధూ శర్మ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు ఉన్నతాధికారులతో బుధవారం నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పండుగ సందర్భంగా తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. జిల్లాలోని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న సమస్యాత్మక గ్రామాలను సిబ్బంది సందర్శించాలన్నా రు. తరుచూ తగాదాలు, నేరాలకు పాల్పడేవారిపై నిఘా ఉంచాలని సూచించారు. పీస్ కమిటీ మీటింగ్‌లు ఏర్పాటు చేసి మండపాల నిర్వాహకులతో మాట్లాడాలని చెప్పారు. పెండింగ్ కేసులను త్వరగా ఛేదించాలని అన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) నరసింహారెడ్డి, కామారెడ్డి డీఎస్పీ నాగేశ్వరరావు, ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు, బాన్సువాడ డీఎస్పీ సత్యనారాయణ, డీసీఆర్బీ డీఎస్పీ మదన్‌లాల్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టరు జార్జ్, జిల్లా సీఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

31న ఆలయంలో పూజా మహోత్సవం

కామారెడ్డి, ఆగస్టు 28 : జిల్లా కేంద్రంలోని శ్రీకోడూరు ఆంజనేయస్వామి ఆలయంలో ఈ నెల 31వ తేదీన శ్రీరుద్రైకాదశీ మంత్ర జపయజ్ఞ-చందనార్చన పూజా మహోత్సవం నిర్వహించనున్నట్లు వేదపండితుడు గంగవరపు ఆంజనేయ శర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రావణ మాసం చివరి శనివారం సందర్భంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మహోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

జిల్లా వాసికి డాక్టరేట్

కామారెడ్డి, ఆగస్టు 28 : పట్టణానికి చెందిన మన్నె శ్రీనివాసులు రాజస్థాన్‌లోని సన్రైజ్ విశ్వ విద్యాలయంలో ఆంగ్ల విభాగంలో డాక్టరేట్ పట్టా సాధించారు. ఈ సందర్భంగా బుధవారం రాజస్థాన్‌లో డాక్టర్ పట్టాను అందుకున్నారు. ది స్టడీ ఆన్ ముల్క ఆనంద్ కాంట్రిబ్యూటిషన్ టూ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ అనే అంశంపై డాక్టర్ లోకేశ్ సింగ్ పర్యవేక్షణలో పరిశోధనలు చేసి రికార్డులను సమర్పించారు. వాటిని పరిశీలించిన యూనివర్సిటీ అధికారులు అతనికి పీహెచ్‌డీ పట్టాను అందించారు. శ్రీనివాసులు భిక్కనూర్ మండలంలోని అహ్మద్ కళాశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

భిక్కనూరు, ఆగస్టు 28 : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మహిళ మృతి చెందినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. బుధ వారం ఉదయం భిక్కనూరు మండలం బస్వాపూర్ చెందిన బాలమణి(49) 44వ నంబర్ జాతీయ రహదారి బస్వాపూర్ శివారులో ఉన్న ఎల్లమ్మ ఆలయం వద్ద రోడ్డు దాటుతున్నది. హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఆమె తల, కాళ్లకు గాయాలయ్యాయి. వెంటనే కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ముగ్గురికి గాయాలు

భిక్కనూరు, ఆగస్టు 28 : రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ముగ్గురికి గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. భిక్కనూరులోని జాతీయ రహదారిపై సిద్ధరామేశ్వర నగర్ గ్రామ శివారులో ఉన్న పెట్రోల్ బంక్ వద్ద పెద్దమాల్లారెడ్డికి చెందిన పెంటయ్య, రాజమణి, కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామానికి చెందిన రాజులు ద్విచక్ర వాహనం సిద్ధరామేశ్వర్ యూటర్న్ వద్ద రోడ్డు దాటుతుండగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో పెద్దమల్లారెడ్డికి చెందిన పెంటయ్య, రాజమణికి స్వల్ప గాయాలుకాగా చిన్న మల్లారెడ్డి గ్రామానికి చెందిన రాజు తలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనేవారిని 108 అంబులెన్స్‌లో కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు స్థానికులు తెలిపారు.

బోరు డ్రిల్లింగ్ ప్రారంభం

కామారెడ్డి, ఆగస్టు 28 : పట్టణంలోని 47వ వార్డులో ఉన్న పోలీసు స్టేషన్ పక్క గల్లీలో బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందూప్రియ బోర్ డ్రిల్లింగ్ ప్రారంభించారు. పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సుజాత, కౌన్సిలర్లు గెరిగంటి స్వప్న లక్ష్మీనారాయణ, నజీరుద్దీన్, పిట్ల వేణుగోపాల్, పాతశివ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

జిల్లా కమిటీ ఎన్నికల

కామారెడ్డి, ఆగస్టు 28 : తెలంగాణ సంస్కృతికి సారథి జిల్లా కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రమేశ్‌రావు, గౌరవ అధ్యక్షుడిగా దేవయ్య, ఉపాధ్యక్షుడిగా ఐండ్ల రాము, ప్రధాన కార్యదర్శిగా ఆకుల మహేందర్, కోశాధికారిగా విఠల్ రెడ్డి, ప్రచార కార్యదర్శిగా నాగరాజు, సలహాదారులుగా ప్రశాంత్ రెడ్డి, కాశీరాం, తిరుపతి, దివ్యశ్రీ, సభ్యులుగా లక్ష్మీనారాయణ, పోశెట్టి, నరేశ్, సవిత, శిల్ప, లతను ఎన్నుకున్నారు.

పీఎంపీలు, ఆర్‌ఎంపీలు ఇంజెక్షన్లు ఇవ్వొద్దు

సూచనలు ఇస్తున్న లింగంపేట వైద్యాధికారిణి హిమబిందు, ఎంపీడీవో నరేశ్

రామారెడ్డిలోని ఓ క్లినిక్‌లో రోగులకు సెలైన్ ఎక్కిస్తున్న ఆర్‌ఎంపీ

లింగంపేట, ఆగస్టు 28: పీఎంపీలు, ఆర్‌ఎంపీలు చికిత్స కోసం వచ్చిన వారికి ఇంజెక్షన్లు ఇవ్వొద్దని మండల వైద్యాధికారిణి హిమబిందు, ఎంపీడీవో నరేశ్ సూచించారు. మండలంలోని శెట్పల్లి, లింగంపేట గ్రామాల్లోని పలు పీఎంపీ, ఆర్‌ఎంపీల దవాఖానలను బుధవారం వారు తనిఖీ చేశారు. పీఎంపీ, ఆర్‌ఎంపీలు రోగులకు సెలైన్లు, ఇంజెక్షన్లు ఇవ్వరాదన్నారు. జ్వరంతో బాధపడుతున్న వారికి చికిత్సలు చేయొద్దని సూచించారు. దవాఖానల్లో వేసిన పడకల(బెడ్ల)ను తీసివేయాలని వారికి సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే దవాఖానలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. మండల కేంద్రంలో మూడు, శెట్పల్లి గ్రామంలోని ఒక దవాఖానను వారు తనిఖీ చేశారు.

ప్రైవేటు దవాఖానల్లో తనిఖీలు..

రామారెడ్డి, ఆగస్టు 28: రామారెడ్డిలోని ఎనిమిది ప్రైవేటు దవాఖానలను మండల మెడికల్ ఆఫీసర్ సురేశ్ తనిఖీ చేశారు. ఆర్‌ఎంపీ చెన్నం దత్తయ్య తన ప్రైవేటు దవాఖానలో రోగులకు సెలైన్ పెట్టి చికిత్సలు అందించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కావొద్దని హెచ్చరించారు. పీఎంపీలు కేవలం ప్రాథమిక చికిత్స చేయాలని, జ్వరంతో బాధపడేవారిని ప్రభుత్వ దవాఖానలకు పంపించాలని సూచించారు.

ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

మద్నూర్, ఆగస్టు 28: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మద్నూర్‌లో నిర్వహిస్తున్న సర్వేను ఆయన బుధవారం పరిశీలించారు. సర్వే చేస్తున్న తీరును సంబంధిత బీఎల్వోలను అడిగి తెలుసుకున్నారు. 18ఏండ్లు నిండిన వారిని ఓటరుగా నమోదు చేసుకునేందుకు దరఖాస్తులు తీసుకోవాలని బీఎల్వోలకు సూచించారు. ప్రతి ఇంట్లో కుటుంబ సభ్యుల పరిశీలన, ఓటర్లు ఆ ఇంట్లో ఉంటున్నారా..? ఇతర ప్రాంతాలకు వెళ్లారా..? అనే విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఆయనవెంట తహసీల్దార్ ముజీబ్, ఎంపీడీవో రాణి, సీనియర్ అసిస్టెంట్ విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

మద్నూర్‌లో సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

కృష్ణుడు, గొల్లభామల వేషధారణలో చిన్నారులు

భవానీపేటలో గోకులాష్టమి

లింగంపేట, ఆగస్టు 28: మండలంలోని భవానీపేట గ్రామంలో గోకులాష్టమి వేడుకలను మంగళవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాల కాల్వలను ఏర్పాటు చేశారు. చిన్నారులకు గోపికలు, కృష్ణుల వేషధారణ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితను కలిసిన డీసీఎంఎస్ డైరెక్టర్

కవితకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కపిల్‌రెడ్డి

లింగంపేట(తాడ్వాయి), ఆగస్టు 28: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఢిల్లీలోని బీఆర్‌ఎస్ భవన్‌లో డీసీఎంఎస్ డైరెక్టర్ కపిల్‌రెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు మంగారెడ్డి తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు నేత్ర పరీక్షలు

రామారెడ్డి, ఆగస్టు 28: సదాశివనగర్‌లోని బీసీ హాస్టల్ విద్యార్థులకు నేత్ర వైద్యుడు హరికిషన్‌రావు బుధవారం కంటి పరీక్షలు నిర్వహించారు. మొత్తం 71 మంది విద్యార్థులను పరీక్షించి.. వారిలో నలుగురికి దృష్టిలోపం ఉన్నట్లు నిర్ధారించారు. వారికి కండ్ల జోడు అందజేస్తామని డాక్టర్ తెలిపారు. ముగ్గురికి ఏ విటమిన్ టాబ్లెట్లు ఇచ్చారు. ఆర్‌బీఎస్‌కే బాధ్యుడు మారుతి, వైద్య సిబ్బంది ఆయుష, ఏఎన్ఎం రమ్య, వార్డెన్ నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ విజేతలుగా రామారెడ్డి జట్లు

విజేతగా నిలిచిన రామారెడ్డి ఫుట్‌బాల్ జట్ల సభ్యులు

రామారెడ్డి, ఆగస్టు 28: మెదక్ జిల్లా రామయంపేట్‌లో ఇటీవల యువజ్యోతి జోనల్ డిస్ట్రిక్ట్ ఫుట్‌బాల్ టోర్నీని నిర్వహించారు. టోర్నీలో అండర్-14, -16 విభాగాల్లో రామారెడ్డిలోని మెగా హిందూ జట్లు విజేతలుగా నిలిచినట్లు క్రీడాకారులు తెలిపారు. దీంతో గ్రామస్తులు ఇరుజట్లకు అభినందనలు తెలిపారు. రాష్ట్రస్థాయిలో గ్రామానికి మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం మండల కార్యవర్గం ఎన్నిక

ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం కార్యవర్గ సభ్యులు వీరే..

ఎల్లారెడ్డి, ఆగస్టు 28: ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఎల్లారెడ్డి మండల కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు కొంగల వెంకట్ తెలిపారు. ఎల్లారెడ్డిలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘ సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించామన్నారు. సంఘం మండల అధ్యక్షుడిగా మంత్రి వెంకటయ్య, ఉపాధ్యక్షులుగా శివలింగం, నౌషా, సాయిలు, సంగ్యా, ప్రధాన కార్యదర్శిగా భాస్కర్ రాథోడ్, కోశాధికారిగా సాయిలు, సహాయ కార్యదర్శులుగా మాన్య, శివరాములు, అనితాదేవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మెగావత్ కనీరాం, జిల్లా ఉపాధ్యక్షుడు జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ ఎల్లారెడ్డి నగర కార్యవర్గం..

ఏబీవీపీ ఎల్లారెడ్డి నగర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కామారెడ్డి జిల్లా కన్వీనర్ రోహిత్ తెలిపారు. ఎల్లారెడ్డి పట్టణంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నిక జరిగిందన్నారు. ఎల్లారెడ్డి నగర అధ్యక్షుడిగా జాషువ, కార్యదర్శిగా వెంకట్, వసతి గృహాల ఇన్‌చార్జిగా వంశీని ఎన్నుకున్నట్లు తెలిపారు.

కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులు

లింగంపేటలో గుంతలను పూడ్చివేయిస్తున్న అధికారులు

లింగంపేట/ నాగిరెడ్డిపేట, ఆగస్టు 28: లింగంపేటలో పారిశుద్ధ్య పనులు కొనసాగుతున్నాయి. గ్రామంలోని పలు వాడల్లోని మురికి కాలువల్లో పేరుకుపోయిన పూడిక మట్టిని తొలగించడంతోపాటు డ్రైనేజీల పక్కన ఉన్న పిచ్చి మొక్కలను తొలగిస్తున్నారు. దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తున్నట్లు ఎంపీడీవో నరేశ్ తెలిపారు. గ్రామంలో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను ఆయన బుధవారం పరిశీలించారు. బస్టాండ్ ప్రాంతంలో రహదారి నిర్మాణం సమయంలో డివైడర్ నిర్మాణం కోసం వదిలిన ఖాళీ స్థలం కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయని, డివైడర్ గుంతలను పూడ్చి వేయించారు. ఎంపీడీవోవెంట పంచాయతీ కార్యదర్శి శ్రవణ్‌కుమార్ ఉన్నారు. నాగిరెడ్డిపేట మండలంలోని లింగంపల్లి కలాన్, వదల్‌పర్తి గ్రామాలను ఎంపీడీవో ప్రభాకర్ సందర్శించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులు వనజ, వాజిద్‌కు సూచించారు. వాటర్ ట్యాంకులను వారంలో రెండు సార్లు శుభ్రం చేయించాలన్నారు. గ్రామంలోని శ్మశాన వాటిక, హరిత వనాలను పరిశీలించారు. గ్రామ పంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు.

నాగిరెడ్డిపేట మండల ప్రత్యేక అధికారిణిగా లక్ష్మి

నాగిరెడ్డిపేట ఆగస్టు 28: నాగిరెడ్డిపేట మండల ప్రత్యేకాధికారిణిగా పిట్లం ఏడీఏ లక్ష్మిని నియమించినట్లు ఎంపీడీవో ప్రభాకర్ తెలిపారు. ఇప్పటి వరకు మండల ప్రత్యేకాధికారిగా పని చేసిన వీరాస్వామి పది రోజుల క్రితం నిజామాబాద్ జిల్లా కేంద్రానికి బదిలీపై వెళ్లారు. దీంతో పిట్లం ఏడీఏ లక్ష్మికి ఎల్లారెడ్డి ఏడీఏతోపాటు మాల్తుమ్మెద విత్తనక్షేత్రం ఏడీఏ, నాగిరెడ్డిపేట మండల ప్రత్యేకాధికారిణిగా అధికారులు బాధ్యతలను అప్పగించారని ఎంపీడీవో తెలిపారు.

రుణమాఫీ కాని రైతులు

కుటుంబ నిర్ధారణ చేసుకోవాలి

బిచ్కుంద, ఆగస్టు 28: రుణమాఫీ కాని రైతులు తమ కుటుంబ నిర్ధారణ చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రాజలింగం అన్నారు. మండలంలోని పుల్కల్ గ్రామంలో రేషన్‌కార్డులేని, రుణమాఫీ కాని రైతుల కుటుంబ నిర్ధారణ కోసం దరఖాస్తులను పరిశీలిస్తూ.. యాప్‌లో నమోదు చేశారు. అనంతరం ఎస్బీఐలో రుణమాఫీ కాని రైతుల వివరాలను తెలుసుకున్నారు. ఆయనవెంట ఏఈవోలు దయానంద్, భాను, ప్రశాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నేటి నుంచి వివరాలు సేకరణ

నాగిరెడ్డిపేట, ఆగస్టు 28: మండలంలోని పోచారం, వదలపర్తి, మాల్తుమ్మెద, గోలిలింగాల గ్రామాల్లో రుణమాఫీ కాని రైతుల వివరాలను గురువారం నుంచి సేకరిస్తామని ఏవో హరివెంకటప్రసాద్ బుధవారం తెలిపారు. మండలంలో కుటుంబ సభ్యుల నిర్ధారణ లేకుండా 815మంది రైతుల రుణమాఫీ నిలిచిపోయిందని పేర్కొన్నారు. వారి పూర్తి వివరాలు సేకరిస్తామని తెలిపారు. సెప్టెంబర్ ఐదో తేదీ వరకు గ్రామాల వారీగా వివరాల సేకరణ ఉంటుందని పేర్కొన్నారు.

అంతర్జాతీయ క్రీడాకారుడికి సన్మానం

పెద్దకొడప్‌గల్, ఆగస్టు 28: అంతర్జాతీయ చెస్ క్రీడాకారుడు గణేశ్‌ను స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో లక్ష్మీకాంత్‌రెడ్డి.. గణేశ్‌కు శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ గురుకుల పాఠశాలలో చదువుతున్న పెద్ద కొడప్‌గల్ మండలంలోని కుబ్యానాయక్ తండాకు చెందిన గణేశ్ భారతదేశం తరపున పాకిస్తాన్, రష్యా దేశాల క్రీడాకారులతో పోటీలో పాల్గొన్నాడని తెలిపారు. ఇలాంటి క్రీడాకారులను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు శివాజీ, శ్రీనివాస్, ఎంపీడీవో కార్యాలయం, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

గణేశ్‌ను సన్మానిస్తున్న ఎంపీడీవో లక్ష్మీకాంత్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది

చేప పిల్లలు విడుదల

మెంగారం గ్రామ ఊర చెరువులో చేప పిల్లలను విడుదల చేస్తున్న మత్స్య సహకార సంఘ సభ్యులు

లింగంపేట, ఆగస్టు 28: మండలంలోని మెంగారం గ్రామ ఊర చెరువులో మత్స్య సహకార సంఘం సభ్యులు బుధవారం చేప పిల్లలను వదిలారు. ముదిరాజ్ సంఘ సభ్యులతో నూతన మత్స్య సహకార సంఘం ఏర్పాటు చేశారు. నూతన సహకార సంఘం సభ్యులు ఊర చెరువులో చేప పిల్లలను వదిలారు. కార్యక్రమంలో మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు పర్వయ్య, కార్యదర్శి వెంకటితోపాటు సభ్యులు రాజశేఖర్, దత్తురాం, అశోక్, ప్రశాంత్, నాగరాజు, హనుమంతు, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

వినాయక మండపాల ఏర్పాటుకు అనుమతి తీసుకోవాలి

గాంధారి, ఆగస్టు 28: వినాయక మండపాల ఏర్పాటు కోసం అనుమతి తీసుకోవాలని ఎస్సై ఆంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండపాల నిర్వాహకులు ఆన్‌లైన్‌లో http://www.tspolice.gov.in అనే వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. డీజేలకు అనుమతి లేదని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బిచ్కుంద, ఆగస్టు 28: మండలంలోని హస్గుల్, ఖత్‌గావ్ గ్రామాల మంజీరా పరీవాహక ప్రాంతాల నుంచి ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై మోహన్‌రెడ్డి బుధవారం తెలిపారు. పట్టుబడ్డ ట్రాక్టర్లకు తహసీల్దార్ రూ. మూడువేల చొప్పున జరిమానా విధించాడన్నారు. అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.